డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR

విలేకరులు కావలెను..
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి Peddapalli | గురువారం Thursday | 26 -02 -2026 26 -02-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 39 Issue: 39 | పేజీలు : 08 Pages: 08 | వెల :02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|

## దొంగ సర్టిఫికెట్లతో జడ్జి



- ఐదేళ్ల తర్వాత బట్టబయలు.
- ఇస్లామాబాద్ హైకోర్టు న్యాయమూర్తి పదవి రద్దు.
- విద్యార్హతలపై విచారణలో వెలుగులోకి వచ్చిన నిజాలు.
- విశ్వవిద్యాలయ నివేదికతో పదవి కోల్పోయిన జహంగిరి.

2

## చెన్నై విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

- ఐదు గంటలు విమానంలోనే కూర్చోబెట్టిన ఇండిగో.
- సాంకేతిక కారణాలతో ఆలస్యం.




2

## లంచం కేసులో గనుల డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్

- నాలుగు కోట్లకుపైగా నగదు స్వాధీనం.
- కార్యాలయ డ్రాయర్‌లో మరో నగదు పట్టివేత.
- భువనేశ్వర్‌లో ఆస్తులపై కొనసాగుతున్న సోదాలు.





## బొగ్గుగనిలో ప్రమాదం

- గోడ కూలడంతో కార్మికుడు ఐలయ్యకు గాయాలు.
- బ్లాస్టింగ్ సమయంలో జరిగిన ఘటన.
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలింపు.



2

## తాగుబోతుల వీరంగం

- ఇంట్లో నుంచి యువ కుడిని లాక్కొచ్చి దాడి.
- దాడి వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం.
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం.

# అద్దె భవనాలకు చెక్



- రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు.
- తొలి దశలో 65 కార్యాలయాలకు నిర్మాణం.
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం.
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.



**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 25:**

రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, ఉప విభాగాధికారి కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరికాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు - మిగతా 2 లో...

## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

- మణికొండలో విషాదం.
- బ్రేకప్ అనంతరం మళ్లీ కలిసిన మాజీ స్నేహితుడు.
- మనస్తాపంతో తీసుకున్న తీవ్ర నిర్ణయం?.

2



**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 25:**

మణికొండలోని చిత్రపురి కాలనీలో నివసిస్తున్న యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు - మిగతా 2 లో...

# హంతకులను అరెస్ట్ చేయాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు.
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ.
- పది లక్షలతో ఇల్లు నిర్మాణం.. తక్షణ సహాయంగా లక్ష రూపాయలు.
- హత్యానేరం కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్.



**జనం వాయిస్, నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25:**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దారుణ ఘటనలో మృతి చెందిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆయన, పది లక్షల రూపాయలతో ఇల్లు కట్టిస్తామని ప్రకటించారు. తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న వివిధ వర్గాల నాయకులు, కార్యకర్తలను కలిసి సంఘీభావం తెలిపారు. కుమ్మెరలో - మిగతా 2 లో...

# యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌పై దృష్టి

- గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఏఐపై ముఖ్యమంత్రి సమీక్ష.
- శంతను నారాయణ్‌తో ఉన్నత స్థాయి భేటీ.
- తెలంగాణ రైజింగ్-2047 విజన్ దిశగా చర్చ.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 25:**

గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఏఐ ప్రభావం, యువతకు స్కిల్లింగ్‌రీస్కిల్లింగ్ వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అడోబ్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి, తెలంగాణ రైజింగ్-2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచవ్యాప్తంగా మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో జరుగుతున్న మార్పులు, గ్రీన్ ఎనర్జీ వైపు దేశాలు తీసుకుంటున్న అడుగులు, ఏఐ విప్లవం ఆర్థిక వ్యవస్థపై చూపిస్తున్న ప్రభావం వంటి అంశాలపై విస్తృతంగా - మిగతా 2 లో...



## ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కరీంనగర్ రైల్వే స్టేషన్

- అత్యాధునిక సదుపాయాలతో పునరాభివృద్ధి పూర్తి
- రూ.25.85 కోట్ల వ్యయంతో నిర్మాణం

2

## హామీలు వెంటనే అమలు చేయాలి

- ప్రతి మహిళకు 2,500 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్.
- కరీంనగర్ కలెక్టరేట్ ముందు తెలంగాణ జాగృతి ధర్నా.

# దొంగ సర్టిఫికెట్లతో జడ్జి

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 25:**

న్యాయాన్ని కాపాడాల్సిన హైకోర్టు స్థాయి న్యాయమూర్తే దొంగ సర్టిఫికెట్లతో పదవిని దక్కించుకున్న ఘటన పాకిస్తాన్‌లో వెలుగుచూసింది. ఇస్లామాబాద్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన తారిక్ మహ్మూద్ జహంగిరి విద్యార్హతలకు సంబంధించిన పత్రాలు నకిలీవని విచారణలో తేలడంతో ఆయనను పదవి నుంచి తొలగించారు. డిసెంబర్ 2020లో న్యాయమూర్తిగా నియమితులైన జహంగిరి ఐదేళ్లపాటు పలు కీలక తీర్పులు ఇచ్చారు. అయితే నియామకం అనంతరం సమర్పించాల్సిన విద్యార్హత పత్రాల విషయంలో సరైన ఆధారాలు చూపలేకపోయారు. అధికారులు పలుమార్లు కోరినప్పటికీ ధృవపత్రాలు సమర్పించడంలో విఫలమయ్యారు. దీంతో అధికారికంగా విచారణ చేపట్టారు. కరాచీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సమర్పించిన నివేదికలో ఆయన లా పట్టాకు సంబంధించిన వివరాలు నకిలీవని స్పష్టమైంది. 1988లో నకిలీ ప్రవేశ పత్రంతో పరీక్షకు హాజరైనట్లు, అదే సమయంలో అక్రమంగా వ్యవహరించి పట్టుబడినట్లు వెల్లడైంది. 1989లో మూడేళ్లపాటు విశ్వవిద్యాలయం నుంచి నిషేధం విధించినట్లు నివేదికలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయన చదివినట్లు చెప్పిన ప్రభుత్వ ఇస్లామియా న్యాయ కళాశాలలో కూడా సంబంధిత రికార్డులు లేవని స్పష్టం చేశారు. ఈ వివరాల ఆధారంగా 116 పేజీల నివేదికను కోర్టుకు సమర్పించగా, దాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం జహంగిరిని హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి తొలగిస్తూ ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటన పాకిస్తాన్ న్యాయ వ్యవస్థలో తీవ్ర చర్చకు దారి తీసింది.

# చెన్నై విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

**జనం వాయిస్, చెన్నై, ఫిబ్రవరి 25:**

చెన్నై నుంచి సింగపూర్‌కు బయలుదేరాల్సిన ఇండిగో విమాన ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. సాంకేతిక కారణాలతో విమానం ఆలస్యం కావడంతో సుమారు 200 మంది ప్రయాణికులను దాదాపు ఐదు గంటల పాటు విమానంలోనే కూర్చోబెట్టిన ఘటన కలకలం రేపింది. ప్రయాణ సమయం కంటే ఎక్కువ సేపు విమానంలోనే ఉండాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సరైన సమాచారం ఇవ్వకపోవడం, ఆలస్యానికి గల కారణాలపై స్పష్టత లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు విమానయాన సంస్థ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని వ్యాఖ్యానిస్తున్నారు. విమానయాన సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఆలస్యానికి గల కారణాలు, ప్రయాణికులకు కలిగిన ఇబ్బందులపై స్పష్టత ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# లంచం కేసులో గనుల డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్

**జనం వాయిస్, భువనేశ్వర్, ఫిబ్రవరి 25:**

ఒడిశా విజిలెన్స్ అధికారులు భారీ లంచం కేసును వెలుగులోకి తెచ్చారు. కటక్ సర్కిల్‌కు చెందిన గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేవబ్రత మొహంతీని రూ. 30 వేల లంచం స్వీకరిస్తుండగా అరెస్టు చేశారు. ఈ చర్యను అధికారులు చేపట్టారు. అరెస్టు అనంతరం భువనేశ్వర్‌లోని ఆయన నివాసం సహా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో నాలుగు కోట్ల రూపాయలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇది సంస్థ చరిత్రలోనే అత్యధిక నగదు పట్టివేతగా అధికారులు పేర్కొన్నారు. అదనంగా ఆయన కార్యాలయ డ్రాయర్‌లో మరో లక్ష ఇరవై వేల రూపాయల నగదు కూడా లభ్యమైంది. సోదాల సమయంలో భువనేశ్వర్‌లో ద్వి అంతస్తుల భవనం, సుమారు 130 గ్రాముల బంగారం వంటి ఆస్తులు బయటపడ్డాయి. అనుమానాస్పద ఆస్తుల వివరాలను సేకరించేందుకు అధికారులు మరింత లోతైన విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన ఒడిశాలో సంచలనంగా మారింది. అధికార దుర్వినియోగం, అక్రమ ఆస్తులపై కఠిన చర్యలు కొనసాగిస్తామని విజిలెన్స్ అధికారులు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసి మరిన్ని వివరాలు వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

# బొగ్గుగనిలో ప్రమాదం

**జనం వాయిస్, పెద్దపల్లి, ఫిబ్రవరి 25:**

గోదావరిఖని ప్రాంతంలోని 11 ఇంక్లైన్ బొగ్గుగనిలో ఈ ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన కార్మికుడు ఐలయ్య ఈ ఘటనలో గాయపడ్డాడు. బొగ్గు కోత పనులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. బ్లాస్టింగ్ నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా గోడ కూలిపోవడంతో ఐలయ్యకు చేతి మడిమ, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న ఇతర కార్మికులు వెంటనే స్పందించి అతన్ని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. మొదట గోదావరిఖనిలోని సింగరేణి ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అయితే గాయాలు తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. గనుల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# అద్దె భవనాలకు చెక్

- మొదటిపేజీ తరువాయి...

గౌరవప్రదంగా ఉండాలనే దృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించామని చెప్పారు. మొదటి దశలో ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఉప విభాగాధికారి కార్యాలయాలకు సకల వసతులతో కూడిన శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. రెండో దశలో శిథిలావస్థలో ఉన్న 170 కార్యాలయాలను పునర్నిర్మించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాలు ఒకే నమూనాలో, ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా రూపకల్పన చేయాలని చర్చించారు. స్టాంపులు మరియు నమోదు శాఖలో ఆధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్, పఠాన్ చెరువు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, గచ్చిబౌలి భవనం తుది దశలో ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా మండలాలు విభజించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొత్త మండలాలకు అవసరమైన సిబ్బందిని కేటాయించి సేవలను బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# తాగుబోతుల వీరంగం

**జనం వాయిస్, నల్గొండ, ఫిబ్రవరి 25:**

నల్గొండ జిల్లాలో అర్ధరాత్రి తాగుబోతుల వీరంగం కలకలం రేపింది. నిడుమనూరు గ్రామంలో మద్యం మత్తులో ఉన్న ఓ రౌడీ గ్యాంగ్, ఒక యువకుడిని ఇంటి నుంచి బలవంతంగా లాక్కొచ్చి విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం ప్రకారం, దుండగులు యువకుడిని కాళ్లతో తన్నుతూ, పిడిగుద్దులు గుద్దుతూ దారుణంగా కొట్టారు. ఈ దాడిని వీడియోగా చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్లోడ్ చేసినట్లు తెలుస్తోంది. తమ జోలికి వస్తే ఎవరికైనా ఇదే గతి పడుతుందని బెదిరింపులు కూడా చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. వీడియో ఆధారంగా నిందితుల గుర్తింపుపై దృష్టి సారించారు. గ్రామంలో శాంతిభద్రతలు కాపాడేందుకు అదనపు బలగాలను మోహరించినట్లు సమాచారం. దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

- మొదటిపేజీ తరువాయి...

ప్రాథమిక సమాచారం. సమాచారం ప్రకారం, కోమలి మాజీ స్నేహితుడు అఖిల్ రెడ్డి ఆత్మహత్యకు ముందు ఆమె ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఏడాది క్రితం ఇద్దరూ విడిపోయినప్పటికీ, అతడిని వదిలి ఉండలేక కోమలి తిరిగి సంప్రదించి ఇంటికి పిలిచినట్లు సమాచారం. తనతో కలిసి ఉండాలని కోరగా, అఖిల్ నిరాకరించి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత కోమలి తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వ్యక్తిగత సమస్యలు జీవితాన్ని ముగించుకునే స్థాయికి తీసుకెళ్లకూడదని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడటం, అవసరమైతే నిపుణుల సహాయం పొందడం ద్వారా సమస్యలకు పరిష్కారం వెతకాలని సూచిస్తున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# హంతకులను అరెస్ట్ చేయాలి

- మొదటిపేజీ తరువాయి...

జరిగిన ఈ ఘటన తెలంగాణ సమాజం మొత్తం తలదించుకునేలా చేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పసిపాప హంతకులకు అండగా నిలబడే ప్రతి ఒక్కరూ దోషులేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అయినా, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎవరైనా సరే హంతకులకు మద్దతు ఇవ్వడం పూర్తిగా తప్పని కేటీఆర్ అన్నారు. హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ఎనిమిది మందిపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పసిపాపను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి జైల్లో వేయాలని, అవసరమైతే ఉరిశిక్ష విధించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.



# యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌పై దృష్టి

- మొదటిపేజీ తరువాయి...

చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ముందుచూపుతో తీసుకోవాల్సిన విధాన నిర్ణయాలపై సమావేశంలో సమగ్ర సమీక్ష జరిగింది. తెలంగాణను శక్తివంతమైన తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించేందుకు విధానాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణ వాతావరణం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సుస్థిర పారిశ్రామిక వృద్ధి దిశగా వ్యూహాత్మక చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఏఐలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఉద్యోగావకాశాల స్వరూపాన్ని మార్చుతున్న నేపథ్యంలో యువతను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయడం అత్యవసరమని ముఖ్యమంత్రి అన్నారు. స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాలను బలోపేతం చేసి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి యాత్రను వేగవంతం చేసేందుకు సాంకేతిక, తయారీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో మరింత సహకారం అందించాలని శంతను నారాయణ్‌ను ముఖ్యమంత్రి కోరారు.

# ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కరీంనగర్ రైల్వే స్టేషన్

**జనం వాయిస్, కరీంనగర్, ఫిబ్రవరి 25:**

తెలంగాణలోని కరీంనగర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రపంచ స్థాయి అత్యాధునిక సౌకర్యాలతో స్టేషన్ రూపు సంతరించుకుని ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తోంది. మొత్తం రూ. 25.85 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు శాతం 100 పూర్తి అయింది. స్టేషన్ భవనాన్ని ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయడంతో పాటు విస్తృతమైన వేచివుండే గదులు, శుభ్రమైన మరుగుదొడ్లు, మెరుగైన తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రాకపోకలకు సులభతరం చేసే విధంగా ప్లాట్‌ఫార్మ్‌లను విస్తరించారు. అదేవిధంగా డిజిటల్ సూచిక బోర్డులు, సీసీ కెమెరా పర్యవేక్షణ, ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం సౌకర్యాలు కల్పించారు. భద్రత, పరిశుభ్రత, సౌకర్యాల పరంగా స్టేషన్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దారు. ఈ పునరాభివృద్ధితో కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రాంతీయ రవాణా కేంద్రంగా మరింత ప్రాధాన్యం పొందనుంది. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతమివ్వనుందని అధికారులు భావిస్తున్నారు.

# హామీలు వెంటనే అమలు చేయాలి

**జనం వాయిస్, కరీంనగర్, ఫిబ్రవరి 25:**

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు నెలకు 2,500 రూపాయల నగదు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల



సమయంలో మహిళల సంక్షేమం కోసం పలు హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ వాటి అమలులో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. మహిళల ఆర్థిక భద్రత కోసం 2,500 రూపాయల సహాయం కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా గ్యాస్, ఉపాధి, విద్య, స్వయం సహాయక బృందాలకు సంబంధించిన హామీలను కూడా పూర్తిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళల అభ్యున్నతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆందోళనకారులు విజ్ఞప్తి చేశారు. ధర్నాలో తెలంగాణ జాగృతి నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

www.janamvoice.com
epaper.janamvoice.com
దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# ఎడిటోరియల్

## విదేశీ అవకాశాలపై యువత ఆకర్షణ.. దేశానికి ప్రతిభ నష్టం

**– గ్లోబల్ యుగంలో వలసల సహజ ధోరణి**
**– మెరుగైన విద్య, వేతనాల కోసం విదేశాల వైపు పరుగులు**
**– దేశీయ అవకాశాల లోటు ఆలోచించాల్సిన అంశమా?**
**– ప్రతిభ నిలుపుదల, తిరిగి రాబట్టే విధానాల అవసరం**

ప్రపంచీకరణ వేగంగా విస్తరించిన ఈ కాలంలో యువత కలలు కూడా సరిహద్దులను దాటుతున్నాయి. ఉన్నత విద్య, పరిశోధన, సాంకేతిక రంగాల్లో మెరుగైన అవకాశాల కోసం వేలాది మంది యువత విదేశాలకు వెళ్లాలని ఆశపడుతున్నారు. ఇది వ్యక్తిగత ప్రగతికి సంకేతమా? లేక దేశానికి ప్రతిభ నష్టమా? అనే ప్రశ్న సమాజంలో గంభీర చర్చకు దారి తీస్తోంది. విదేశాల్లో ఉన్నత విద్యాసంస్థలు, ఆధునిక పరిశోధన వాతావరణం, విస్తృత అవకాశాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఉన్నత వేతనాలు, మెరుగైన జీవన ప్రమాణాలు, వృత్తిపరమైన గౌరవం కూడా ప్రధాన కారణాలు. గ్లోబల్ వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించాలనే తపన సహజం. ప్రపంచాన్ని అన్వేషించాలనే ఆసక్తి యువతలో ఉండటం అభివృద్ధి సంకేతమే. అయితే ఈ ధోరణి మరో కోణంలో ఆందోళన కలిగిస్తోంది. ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులు పెద్ద సంఖ్యలో విదేశాలకు వెళ్తే దేశీయ రంగాల్లో నైపుణ్య లోటు ఏర్పడే ప్రమాదం ఉంది. వైద్యులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు విదేశాల్లో స్థిరపడితే దేశ అభివృద్ధికి అవసరమైన మానవ వనరులు తగ్గుతాయి. దీర్ఘకాలంలో ఇది శాస్త్రీయ, ఆర్థిక పురోగతిపై ప్రభావం చూపవచ్చు.

యువత విదేశాలకు వెళ్లడం వెనుక దేశీయ వ్యవస్థలో ఉన్న లోపాలు కూడా కారణం కావచ్చు. పరిశోధనలకు తగిన నిధుల కొరత, ఉపాధి నాణ్యతలో లోపం, పారదర్శక నియామక వ్యవస్థల కొరత వంటి అంశాలు యువతలో అసంతృప్తిని కలిగించవచ్చు. సరైన అవకాశాలు, ప్రోత్సాహం, వృత్తిపరమైన గౌరవం ఉంటే చాలామంది ఇక్కడే కొనసాగాలనుకోవచ్చు.

అయితే విదేశాలకు వెళ్లిన ప్రతి యువకుడు దేశానికి నష్టమేనని భావించడం సరైంది కాదు. వారు సంపాదించిన జ్ఞానం, అనుభవం, నైపుణ్యాలు తిరిగి దేశానికి ఉపయోగపడవచ్చు. అనేక మంది విదేశాల్లో సాధించిన ప్రతిభతో తిరిగి వచ్చి పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలు స్థాపించి దేశ అభివృద్ధికి దోహదపడ్డారు. విదేశీ అనుభవం దేశానికి ఆస్తిగా మారేలా విధానాలు ఉండాలి. ప్రతిభ నిలుపుదల కోసం సమగ్ర వ్యూహం అవసరం. పరిశోధనలకు పెట్టుబడులు పెంచాలి. ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వాలి. పారదర్శక నియామక వ్యవస్థలు, సముచిత వేతనాలు, వృత్తి స్థిరత్వం కల్పించాలి. యువతలో విశ్వాసం పెరిగితేనే వారు దేశంలోనే భవిష్యత్తు నిర్మించేందుకు ముందుకు వస్తారు.

విదేశీ అవకాశాలను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు. గ్లోబల్ అనుసంధానం ఆధునిక యుగానికి అవసరం. కానీ వ్యక్తిగత కలలు, జాతీయ ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించడం ముఖ్యం. దేశం యువతకు అనుకూల వాతావరణం కల్పిస్తే ప్రతిభ ఇక్కడే వికసిస్తుంది. మొత్తంగా విదేశీ అవకాశాలపై యువత ఆకర్షణను ఒక అవకాశంగా కూడా చూడాలి. ప్రపంచ అనుభవాన్ని సొంతం చేసుకుని దేశ అభివృద్ధికి మలచే విధానాలు అవసరం. ప్రతిభ ప్రవాహాన్ని ప్రతిభ వినియోగంగా మార్చగలిగితేనే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది. యువత కలలు విస్తరించాలి; కానీ ఆ కలల సారాన్ని దేశాభివృద్ధితో ముడిపెట్టే దిశగా చర్యలు తీసుకోవాలి. యువత విదేశాల వైపు చూస్తున్నదంటే దేశీయ వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్న సంకేతం కూడా. సరైన అవకాశాలు, పరిశోధన వాతావరణం, సముచిత వేతనాలు, పారదర్శక నియామక వ్యవస్థ ఉంటే చాలామంది యువత ఇక్కడే కొనసాగాలనుకోవచ్చు. కాబట్టి సమస్యను కేవలం వలసల కోణంలో కాకుండా, అవకాశాల సృష్టి కోణంలో చూడాలి.

విదేశాలకు వెళ్లిన యువత పూర్తిగా దేశానికి దూరమవుతారని అనుకోవడం సరైంది కాదు. వారు అక్కడ సంపాదించిన జ్ఞానం, అనుభవం దేశానికి మేలు చేయగలదు. అనేక మంది విదేశాల్లో సాధించిన ప్రతిభతో తిరిగి వచ్చి దేశ అభివృద్ధికి దోహదపడ్డారు. అందుకే నిలుపుదలతో పాటు తిరిగి రాబట్టే విధానాలు అవసరం. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి యువతకు అనుకూల వాతావరణం కల్పించాలి. పరిశోధనలకు పెట్టుబడులు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, పారదర్శక విధానాలు అవసరం. ఉపాధి నాణ్యత మెరుగుపడితేనే యువతలో విశ్వాసం పెరుగుతుంది.

మొత్తంగా విదేశీ అవకాశాలపై యువత ఆకర్షణను పూర్తిగా ప్రతికూలంగా చూడలేం. అది గ్లోబల్ యుగానికి సంకేతం. కానీ దేశ అభివృద్ధి కోసం ప్రతిభను నిలుపుకోవడం కూడా అంతే ముఖ్యం. అవకాశాలు, ప్రోత్సాహం, నమ్మకం కల్పిస్తే యువత దేశంలోనే భవిష్యత్తును నిర్మించగలదు. వ్యక్తిగత కలలు, జాతీయ ప్రయోజనాలు మధ్య సమతుల్యత సాధించడమే అసలు సవాల్.

# నేల తల్లికి 'బయోచార్' సంజీవని!

**మట్టిలో కనుమరుగవుతున్న కర్బనానికి ప్రాణవాయువు.. నిస్సార భూములకు బయోచార్‌తో పునర్జీవం.**

**మట్టి బతికితేనే మనిషి బతుకుతాడు. కానీ, ఆధునిక సాగులో మితిమీరిన రసాయనాల వాడకం వల్ల మన కన్నతల్లి లాంటి నేల నేడు విలవిలలాడుతోంది. ఒకప్పుడు చేత్తో తవ్వితే వానపాములతో కళకళలాడిన పొలాలు నేడు రాయిలా గట్టిపడుతున్నాయి. ఊపిరి ఆడని మట్టిలో జీవం నశిస్తోంది. ఈ నిశ్శబ్ద విపత్తు నుంచి భూమిని కాపాడి, మళ్లీ ప్రాణం పోయగల 'సంజీవని' మన కళ్లముందే ఉంది. అదే 'బయోచార్' పంట వ్యర్థాలను శాస్త్రీయంగా కాల్చి తయారు చేసే ఈ పదార్థం కేవలం ఎరువు మాత్రమే కాదు, అది నేలతల్లికి మనం ఇచ్చే ప్రాణవాయువు!**



### మట్టిలో మాయమవుతున్న జీవం!

ఆరోగ్యకరమైన భూమిలో సేంద్రియ కర్బనం కనీసం 1% ఉండాలి. కానీ ప్రస్తుత సర్వేల ప్రకారం అనేక ప్రాంతాల్లో ఇది 0.5% కంటే తక్కువకు పడిపోయింది. కర్బనం లేని నేల 'జీవం లేని మట్టి'తో సమానం. మనం ఎంత ఖరీదైన ఎరువులు వేసినా, ఎంత నీరు పెట్టినా మొక్కలకు అందవు. సూక్ష్మజీవులు నశించి, భూమి నిస్సారమైపోతోంది. ఫలితంగా పెట్టుబడి పెరుగుతోంది.. దిగుబడి తగ్గుతోంది. ఈ విషవలయాన్ని ఛేదించే అద్భుత శక్తి బయోచార్‌కు ఉంది..

### ఏమిటీ బయోచార్?

బయోచార్ అంటే రసాయనం కాదు. వరి పొట్టు, పత్తి కట్టెలు, చెరకు పిప్పి, మొక్కజొన్న



పిప్పి వంటి వ్యవసాయ వ్యర్థాలను ఆక్సిజన్ తగలకుండా నియంత్రిత పద్ధతిలో కాల్చి తయారు చేసే కర్బన పదార్థం. ఇది సాధారణ బొగ్గులా పూర్తిగా కాలి బూడిద అవ్వదు. ఇందులో వందల ఏళ్ల పాటు స్థిరంగా ఉండే గుణం ఉంటుంది. దీన్ని ఒకసారి నేలలో కలిపితే, అది తరతరాల పాటు భూసారాన్ని రక్షిస్తూనే ఉంటుంది.

### బహుళ ప్రయోజనాలు:

నీటి సంరక్షణ: బయోచార్‌లో కోట్లాది సూక్ష్మ రంధ్రాలు స్పాంజీలా పనిచేస్తాయి. ఇవి వర్షపు నీటిని పట్టి ఉంచి, కరువు కాలంలోనూ పంటకు తేమను అందిస్తాయి.

**ఎరువుల పొదుపు :** మనం వేసిన ఎరువులు భూమిలోకి ఇంకిపోయి వృథా కాకుండా బయోచార్ పట్టి ఉంచుతుంది. దీనివల్ల ఎరువుల వాడకాన్ని 20–30% వరకు తగ్గించుకోవచ్చు.

**సూక్ష్మజీవుల నివాసం :** హితకారి బ్యాక్టీరియా, వానపాములకు ఇది సురక్షిత గృహంలా మారుతుంది. నేల గుల్లబారి వేర్లు బలంగా, లోతుగా విస్తరిస్తాయి.

చౌడు నివారణ : గట్టిపడిన మరియు చౌడు పట్టిన భూములను సైతం క్రమంగా సాగుకు యోగ్యంగా మార్చే అద్భుత గుణం దీనికి ఉంది.

### రైతు స్థాయిలోనే తయారీ సులభం:

దీని కోసం భారీ యంత్రాలు అవసరం లేదు. పొలం గట్టునే తయారు చేసుకోవచ్చు:

**నియంత్రిత దహనం :** పాత ఇనుప డ్రమ్ములలో వ్యర్థాలను నింపి, గాలి తగలకుండా కాల్చాలి. పూర్తిగా బూడిద కాకముందే నీటితో ఆర్పాలి.

**యాక్టివేషన్ :** తయారైన బయోచార్‌ను నేరుగా వాడకుండా జీవామృతం లేదా గోమూత్రంలో వారం రోజులు నానబెట్టాలి. అప్పుడే అది పోషకాలతో నిండి 'సూపర్ చార్జ్' ఎరువుగా మారుతుంది.

**వాడకం :** ఎకరాకు 200500 కిలోలు దుక్కిలో కలిపితే సరిపోతుంది. ఇది ఒక దీర్ఘకాలిక పెట్టుబడి.

### ప్రభుత్వ చేయూత అవసరం

పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతోంది. దీనికి బదులుగా, వ్యర్థాలను బయోచార్‌గా మార్చడాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఉపాధి హామీ పథకంలో బయోచార్ యూనిట్లను చేర్చడం, ఎఫ్.పి.ఓ ద్వారా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

రసాయనాలు తాత్కాలిక లాభాన్ని ఇస్తాయి, కానీ భవిష్యత్తును అంధకారంగా మారుస్తాయి. బయోచార్ అనేది మన నేల తల్లికి ఇచ్చే పునర్జన్మ. వ్యర్థాలే వనరులు అని గుర్తించి, సేంద్రియ సాగు దిశగా అడుగులు వేయడం నేడు అత్యవసరం..



జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు

# కొత్త పుంతలు తొక్కుతున్న కృత్రిమ మేధస్సు..

నేటి యావత్తు సమాజాన్ని సాధిస్తున్న ఏకైక సాధనం కృత్రిమ మేధ. నాడు ఏదైనా కావాలి అంటే గూగుల్ మాత్రమే మనకు ఏకైక దిక్కు కానీ నేటి సమాజాన్ని సమన్వయ పరచడంలో గానీ అధికార వికేంద్రీకరణ లో గానీ సమాచారం ప్రసారం లో గానీ అందరికీ అత్యంత వేగవంతమైన ప్లాట్ఫారం కృత్రిమ మేధ. ఈ కృత్రిమ మేధ వల్ల ఎంత పరిపాలన వృద్ధి ఉందో అంతే విధమైన నష్టం వాటిల్లే అవకాశం ఉంది. టెక్నాలజీ విషయంలో గానీ తయారీ రంగంలో గానీ ఇంజనీరింగ్ రంగంలో గానీ సమాచార వ్యాప్తిలో గానీ కృత్రిమ మేధ వాడకం అగ్ని పరీక్ష వంటిదే . సాంకేతికత వినియోగం ఎంతలా ఉపయోగం ఉందో కృత్రిమ మేధ శక్తిని వినియోగించే శక్తి పరిపక్వత ఉందా లేదా అనేది సూటి ప్రశ్న? ఈ మధ్య జరిగినటువంటి గ్లోబల్ కృత్రిమ మేధ సదస్సులో ఢీల్లీ లో జరిగిన కార్యక్రమంలో గౌరవ ప్రధాని చెప్పిన మాటలు ఏంటంటే అంతర్జాతీయాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధ ను తయారు చేయడంలో గాని వాడకంలో గాని భారత దేశాన్ని క్రియాశీల దేశంగా గానీ తయారీ కేంద్రము గా మార్చుటకు గౌరవ ప్రధాని మోదీ గారు గ్లోబల్ ఎ ఐ సమ్మిట్ లో చెప్పిన సందేశం ఏంటంటే చెప్పిన నినాదం MANAV. M అంటే నైతిక విలువల వ్యవస్థ, A అంటే జవాబు దారి పాలన , N అంటే జాతీయ సార్వభౌమత్యం ,A అంటే అందుబాటు సమ్మిళితం ,V అంటే చెల్లుబాటు,సమ్మిళితం .




మరి ఇంతటి ప్రాముఖ్యం ఉన్న కృత్రిమ మేధ వల్ల కలిగే నష్టం కూడా యావత్తు ప్రజానికానికి భయంకరమైన విషయమే . అందులో ఒకటి ఆయుధ సంపత్తు , తయారీ రంగం , సైబర్ క్రైమ్ లు , ఆక్రమణలకు ఒక ఆయుధ సంపత్తిగా మారుతుంది .రెండవది ఉగ్రవాదులు, అనైతిక కార్యకలాపాలకు ఒక శక్తి కేంద్రంగా మారడం దుర్వినియోగం వల్ల. మూడవది కృత్రిమ మేధ మీద ఆధార పడటం వల్ల వక్తిగతమైన గోప్యతా సమాచారం దుర్లభం అయ్యే అవకాశం చాలా ఎక్కువ . నాల్గవది సంపద అనేది కొద్ది మంది చేతుల్లోకి వెళ్ళి అధికార వికేంద్రీకరణ జరగడం . ఐదవది విపరీతమైన కృత్రిమ మేధ వాడకం వల్ల సాంప్రదాయమైన విద్య వ్యవస్థపై వేటు పడి నైపుణ్యత లేక విపరీత మైన నిరుద్యోగ వ్యవస్థ ఏర్పడుతుంది . ఏది ఏమైనా కొన్ని సవరణలు గాని కొన్ని నిర్ణయాలతో పూర్తిగా సంప్రోక్షణ చేయక పోతే తయారీ రంగంలో గానీ ఇంజనీరింగ్ రంగంలో గానీ సమాచార హక్కులు లలో కానీ ఆవిష్కరణ రంగంలో గానీ వృద్ధి కాంక్షతో కాకుండా వాటి వ్యవస్థను దెబ్బ తీసి నీరు గార్చే వ్యవస్థ ఏర్పడుతుంది అశ్రద్ధ వహిస్తే . కృత్రిమ మేధ అనేది ఒక శక్తి కేంద్రంగా పరిణితి చెందాలి తప్ప ఉన్నటువంటి రంగాలను నిర్మూలించి దిగజార్చేలా కాదు. కృత్రిమ మేధ అనేది ఒక వేగవంతమైన చర్యా ప్రేరేపిత వ్యవస్థగా నడవాలి గాని శాసించేలా కాదు..

కృత్రిమ మేధ సామర్థ్యం రంగంలో భారత దేశం యొక్క స్థానం 10. నిపుణులు విషయానికి వస్తే మాత్రం దేశం యొక్క స్థానం 2. దీన్ని బట్టి నిపుణులు ఉన్నప్పటికీ సామర్థ్యం రంగంలో వెనుకబాటు చాలా ఉంది . పెట్టుబడుల విషయంలో కూడా భారత దేశం తక్కువ స్థానంలో ఉంది అగ్రరాజ్యం అమెరికా మొదటి స్థానంలో ఉండగా చైనా , ఐరోపా దేశాలు తర్వాతి స్థానాలలో ఉన్నాయి . సరైన సదుపాయాలతో పాటు వేగవంతమైన పని చేసే సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థలు చాలా అవసరం. అంతర్జాతీయ కృత్రిమ మేధ సామర్థ్యం కలిగిన 10 దేశాలు 1) అమెరికా 2)చైనా 3) సింగపూర్ 4) యు. కె 5)ఫ్రాన్స్ 6)దక్షిణ కొరియా 7)జర్మనీ 8) కెనడా 9) ఇజ్రాయెల్ 10) ఇండియా.

**కృత్రిమ మేధ సామర్థ్యం రంగంలో భారత దేశం యొక్క స్థానం 10. నిపుణులు విషయానికి వస్తే మాత్రం దేశం యొక్క స్థానం 2. దీన్ని బట్టి నిపుణులు ఉన్నప్పటికీ సామర్థ్యం రంగంలో వెనుకబాటు చాలా ఉంది . పెట్టుబడుల విషయంలో కూడా భారత దేశం తక్కువ స్థానంలో ఉంది అగ్రరాజ్యం అమెరికా మొదటి స్థానంలో ఉండగా చైనా , ఐరోపా దేశాలు తర్వాతి స్థానాలలో ఉన్నాయి . సరైన సదుపాయాలతో పాటు వేగవంతమైన పని చేసే సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థలు చాలా అవసరం. అంతర్జాతీయ కృత్రిమ మేధ సామర్థ్యం కలిగిన 10 దేశాలు 1) అమెరికా 2)చైనా 3) సింగపూర్ 4) యు. కె 5)ఫ్రాన్స్ 6)దక్షిణ కొరియా 7)జర్మనీ 8) కెనడా 9) ఇజ్రాయెల్ 10) ఇండియా.**



గురుపాటి శంకర్..
(రచయిత & జర్నలిస్ట్.)
ఎం. ఏ తెలుగు ఉస్మానియా యూనివర్సిటీ.
చరవాణి : 8179885282

# ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం.

- ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన.
- ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు /ఉర్దూ/హిందీ పరీక్షకు (97%) మంది విద్యార్థులు హాజరు.

జనం వాయిస్, పెద్దపల్లి, ఫిబ్రవరి-25:

పెద్దపల్లి జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ భాష పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (5419) మంది హాజరు కావాల్సి ఉండగా, (5271)మంది హాజరు కాగా,(148) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, తొలి రోజు 97 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

# వర్కింగ్ జర్నలిస్టుగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలి.

♦ టిడబ్ల్యూజేఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాబురావు.
♦ టిడబ్ల్యూజేఫ్ డైరీ ఆవిష్కరణ.

జనం వాయిస్,జమ్మికుంట:

తెలంగాణ రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఎలాంటి షరతులు లేకుండా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడతాడి బాబురావు అన్నారు. బుధవారం రోజున డైరీ ఆవిష్కరణ అనంతరం బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టు సంఘం ఏదైనా ఉందంటే ఫెడరేషన్ మాత్రమే అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులు ఎలాంటి షరతులు పెట్టకుండా వర్కింగ్ జర్నలిస్ట్ అందరికీ అక్రిడేషన్ కార్డ్స్ మంజూరు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సౌడమల్ల యోహాన్, రాష్ట్ర నాయకులు భూపతి సంతోష్, జిల్లా నాయకులు ఎండి ఖాజా ఖాన్, కందుకూరి రాజు, నాగపురి రాజు, దొడ్డే రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ అధికారి సస్పెన్షన్.

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

జనం వాయిస్, పెద్దపల్లి, ఫిబ్రవరి- 25:



ఏసీబీ తనిఖీల్లో చిక్కిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే. అలివేణి ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరుగుతున్న అవకతవకల గురించి సమాచారం అందుకున్న ఏసీబీ శాఖ ఫిబ్రవరి 24న ఆకస్మిక తనిఖీలు నిర్వహించిందని, ఆ తనీఖీలలో పట్టుబడిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే. అలీవేణి ను సస్పెండ్ చేస్తున్నామని, మండల వ్యవసాయ అధికారి పై క్రమశిక్షణ చర్యలు విచారణ ముగిసే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని, సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని ఆ ఉత్తర్వులలో కలెక్టర్ పేర్కొన్నారు.

# బ్రదర్స్ టీమ్ ఆధ్వర్యంలో మెగా రంగ్ హోలీ ఉత్సవాలు

- మార్చి 3న జరిగే రంగ్ హోలీ ఫెస్టివల్ నీ విజయవంతం చేయండి







జనం వాయిస్, జమ్మికుంట:

జమ్మికుంట పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బ్రదర్స్ టీమ్ ఆధ్వర్యంలో మెగా రంగ్ హోలీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలను రంగుల హరివిల్లుగా, సాంస్కృతిక ఉత్సాహంతో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి బ్రదర్స్ టీమ్ తరపున ఉచితంగా రంగులు, సంగీతం మరియు స్ప్రింక్లింగ్ వాటర్ సిస్టమ్ ఏర్పాటు చేయబడింది. విద్యార్థులు మరియు యువత ఉత్సాహంగా, సురక్షితంగా హోలీ పండుగను ఆనందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ( దిలీప్) పట్టణ జ× రామకృష్ణ గౌడ్ మున్సిపల్ కమిషనర్ వీణ అయాజ్ హాజరై హోలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువత ఐక్యతతో, ఆనందంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. వేడుకల సందర్భంగా మద్యం, గుడ్లు, ధూమపానం వంటి ఇతరులకు హాని కలిగించే పదార్థాలుపూర్తిగానిషేధించబడినట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. అందరూ నియమాలను పాటిస్తూ సంతోషంగా రంగుల పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ మెగా రంగ్ హోలీ ఉత్సవాన్ని బ్రదర్స్ టీం ఆర్గనైజర్స్ పాతకల ప్రవీణ్, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, గట్టు సాయిరామ్,సామల వెంకట్ రెడ్డి, కొత్త గణపతి రెడ్డి, పనికరి మహేష్ , మహేష్ ప్రణయ్, శివనాగరాజు, సందీప్, అఖిరానందన్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.
- 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై అధికారులతో రివ్యూ.

జనం వాయిస్, పెద్దపల్లి, ఫిబ్రవరి- 25:



గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు కట్టుదిట్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై ఇ.వై టీం నిశాంత్, సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రాంరెడ్డి ,ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, డి.పి.ఓ. వీర బుచయ్య, గోదావరిఖని ఏ.సి. పి.రమేష్, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ [దిలీప్] ను సన్మానించిన

- సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్

జనం వాయిస్, జమ్మికుంట:



జమ్మికుంట పట్టణంలో నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ని ప్రముఖ సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, అభిమానులు, యువ నాయకులు పాల్గొని చైర్మన్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. జమ్మికుంట పట్టణంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమం ఆత్మీయతతో, ఆనందోత్సాహాలతో సాగింది. చైర్మన్ ని కలిసిన మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసం మీద గెలిచి బాధ్యతలు స్వీకరించిన మొలుగు ప్రశాంత్ కుమార్ ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకుడిగా నిలవాలని ఆకాంక్షించారు. సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం అందించడంతో పాటు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇల్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదు.

జనం వాయిస్, మంథని, ఫిబ్రవరి 25:



మంథని మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదని లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు వస్తున్న వార్తలలో ఎలాంటి నిజం లేదని ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు గుండ రాజు, తీగల సమ్మయ్య, పోలు శివ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం మంథని పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. మంథని మున్సిపాలిటీ పరిధిలో 13 వార్డులలో ఏ వార్డులో లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వినతి మేరకు 54 ఇండ్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించాడని వారు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలని పూర్తి సహకారం అందిస్తామని, ఎవరైనా లబ్ధిదారులను బెదిరింపులు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. కొందరు తమ రాజకీయ లబ్ధి కోసమే అధికార కాంగ్రెస్ పార్టీని పార్టీ కార్యకర్తలను బదునం చేస్తున్నారనీ పోతారవేణి రాజయ్య, అట్టెం వినయ్, కొంతం శ్రీను, మోహన్, నాయని సంతు ఆరోపించారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

జనం వాయిస్, మంథని:

ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు తెలుగు, హిందీ..సంస్కృతం,.. ఉర్దూ..పరీక్షలు జరిగాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలికల కళాశాలలో మొత్తం 208 మంది విద్యార్థులకు గాను 202 మంది హజరయ్యారు. బాలుర కళాశాలలో 158 మందికి గాను 154 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేపటి నుంచి ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# కౌశిక్ రెడ్డి కేసుపై గంగుల కమలాకర్ ప్రశ్నలు

- సీఐడీకి కేసు బదిలీపై అభ్యంతరం.
- నిరాధార ఆరోపణలతో కేసు నమోదు చేశారన్న విమర్శ.
- ఎమ్మెల్యేలను వేధించవద్దని డీజీపీకి విజ్ఞప్తి.




**జనం వాయిస్,హైదరాబాద్, ఫిబ్రవరి 25:**

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై నమోదు చేసిన కేసును సీఐడీకి బదిలీ చేయడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సాధారణంగా నమోదు చేసిన కేసును ఉన్నత దర్యాప్తు సంస్థకు ఎందుకు అప్పగించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన ప్రశ్నించారు. మత మార్పిడి చేస్తున్నాడని కౌశిక్ రెడ్డి ఎక్కడా ప్రస్తావించలేదని, అయినప్పటికీ నిరాధార ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేశారని గంగుల కమలాకర్ ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపుల కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై ఇలాంటి కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి ఇప్పటికైనా ఎమ్మెల్యేలను వేధించే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం మానేయాలని గంగుల కమలాకర్ సూచించారు. చట్టపరమైన విధానాలు నిష్పాక్షికంగా అమలు కావాలని, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా వ్యవహరించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు గౌరవం ఉండాలని, అనవసర కేసులతో వేధింపులు ఆపాలని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తగిన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆటో కార్మికులకు హరీష్ రావు ఆత్మీయ భరోసా

- సిద్దిపేట ఆటో కోఆపరేటివ్ సంఘం ద్వారా ఆర్థిక సహాయం.
- 18 కుటుంబాలకు రూ.36 లక్షల భీమా చెల్లింపు.
- ఇటీవల రెండు కుటుంబాలకు రూ.4 లక్షల చెక్కుల అందజేత.

**జనం వాయిస్, సిద్దిపేట, ఫిబ్రవరి 25:**

